క్లుప్తంగా

నేడు మంత్రి జూపల్లి రాక

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని మండల సమైక్య ఏపీఎం బిచ్చన్న తెలిపారు. ఉదయం 8 గంటలకు గోవర్ధనగిరిలో, 9 గంటలకు వీపనగండ్ల, 9:30 నిమిషాలకు కల్వరాల, 10 గంటలకు పుల్గర్‌చర్ల గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు.

ఉన్నత స్థానాలను అధిరోహించాలి



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన వార్డు మాజీ సభ్యురాలు కుర్వ మంజుల సుదర్శన్ దంపతుల కుమార్తె కుర్వ ప్రీతి నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. సోమవారం కాంగ్రెస్ నాయకులు విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ మహదేవ్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్ విజయ్, సాయిబాబా, శ్రీధర్‌రెడ్డి, మహేందర్, దేవేందర్, సత్యనారాయణ ఉన్నారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారికి సన్మానం



వనపర్తి టౌన్: వృత్తిలో నిబద్ధతగా ఉండే శ్రీనివాసులు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం పెంటగాన్ కేంద్రంలో డాక్టర్ శ్రీనివాసులను సన్మానించారు. కార్యక్రమంలో జీజే శ్రీనివాసులు, కంది వెంకటరమణ, బాలస్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: పట్టణంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీలోని వార్డుల్లో పర్యటించారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన తెలిపి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్ చెత్తాచెదారంతో నిండిపోయిందని, వీధి దీపాలు వెలగడం లేదని, డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యూనూస్, శేఖర్, సమీర్, అఖిల్, రాము, శ్రీను ఉన్నారు.

జిల్లా మహాసభలకు తరలిన నాయకులు

పాన్‌గల్: సీపీఎం ఆధ్వర్యంలో వీపనగండ్ల మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా మహాసభలకు మండలం నుంచి 20 మంది పార్టీ ప్రతినిధులు సోమవారం మహాసభలకు తరలివెళ్లినట్లు పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్ తెలిపారు. ఈ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం, నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చేస్తారని ఆయన పేర్కొన్నారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

అమరచింత: మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించి, తగు నివేదికలు అందించాలని అంబుడ్స్‌పర్సన్ సత్యనారాయణరెడ్డి కోరారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో సోమవారం ఉపాధి పనులపై చేపట్టాల్సిన సామాజిక తనిఖీ కోసం వచ్చిన డీఆర్‌పీ, సీఆర్‌టీలకు అవగాహన కల్పించారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో పాటు పనిచేసిన కూలీలకు వేతనాలు అందాయ లేదా అన్న విషయాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు, ఇంచార్జి ఏపీఓ రఘు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణాలు ఇవ్వాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకెళ్తుందని, రైతులందరికీ బేషరతుగా రుణాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో మేనేజర్ అబ్బాస్‌అలీతో కాంగ్రెస్ నాయకులు కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశారని బ్యాంకుల అధికారులు తిరిగి రుణాలు ఇవ్వడంలో తాత్సారం చేస్తూ ప్రభుత్వాన్ని బద్నామ్ చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, మణివర్ధన్‌రెడ్డి, నాగేష్, రఫీక్, రమేష్‌యాదవ్, ప్రకాష్, అంజనేయులు తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



అప్పరాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ అన్నారు. మండలంలోని అప్పరాల, సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలన్నారు. అనవసర అపోహలను నమ్మి దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ఏ గ్రేడ్‌కు రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ.2,300 ధర ఇవ్వడంతో పాటు సన్న రకానికి రూ.500బోనస్ చెల్లిస్తున్నారు. ఎన్నికల ముందుకు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షలు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో రైతులతో పాటు అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారెడ్డి, బీచుపల్లియాదవ్, మాసన్న, కేశవులు, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, సీసీ సంగీత, మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు ఉన్నారు.

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అల్వాల, మద్దిగట్ల, గట్లఖానాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొను



మద్దిగట్లలో..

గోలు కేంద్రాలను విష్ణువర్ధన్‌రెడ్డి రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సత్యారెడ్డి, రఘుప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటేశ్వర్ రెడ్డి, నరేష్, రాంసింగ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బుచ్చిలింగం, బాల్‌రెడ్డి, సుదర్శన్, లక్ష్మారెడ్డి, కురుమూర్తి, రైతులు, ఆయా గ్రామాల ప్రజలకు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

కొత్తకోట మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో విలియంకొండ, మిరాసిపల్లి, పామాపురం, రామకృష్ణాపురం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వాసుదేవారెడ్డి హాజరవుతారని సోమవారం పామాపురం పీఏసీఎస్ సీఈవో రాఘవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ వితరణ



విద్యార్థులకు కంప్యూటర్ అందజేస్తున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట: మండలంలోని జయన్న తిర్మలాపూర్ ప్రభుత్వ పాఠశాలకు సోమవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి సొంత డబ్బులతో రూ.25 వేల విలువ చేసే కంప్యూటర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా పాఠశాల యాజమాన్యం సమస్యను తన దృష్టికి తీసుకొస్తే తప్పకుండా తనవంతు సాయం అందిస్తానని చెప్పారు. అలాగే విద్యార్థులు ఆడుకునేందుకు ఆటస్థలాన్ని సొంత డబ్బులతో తయారు చేయిస్తున్నానని, తొందర్లోనే అది అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి ప్రవీన్‌కుమార్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ బాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మస్తీపురంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్



కొత్తకోటలో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

అమరచింత: తరగతి గదుల్లో ఉంటూ విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అప్పుడే తమ తల్లిదండ్రులు ఆశించిన కలలను నిజం చేసే వారిగా ఎదుగుతారని సీఐ శివకుమార్ అన్నారు. మండలంలోని మస్తీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు చెడు అలవాట్లతో జరిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మొబైల్ వాడటం ద్వారా తెలియని విషయాలను తెలుసుకునే అవకాశం ఉందని, అలాంటి వాటికే ప్రాధాన్యత ఇవ్వాలని, వీటిలోని చెడు విషయాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లుగా ఉన్న తమ పిల్లలకు మోటార్ బైక్‌లు ఇవ్వకూడదని కోరారు. మైనర్లు బైక్ నడపడం నేరమని, ఇందుకు వాహనం ఇచ్చిన యాజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వీటి వల్ల మోసపోకుండా తమ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. మస్తీపురంలో శనివారం రాత్రి మైనర్లు బైక్ నడపడం ద్వారానే ప్రమాదం జరిగిందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ సింగ్, ఎస్‌ఐ సురేష్, హెచ్‌ఎం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో విద్యార్థులకు సెల్‌ఫోన్, టీవీలను అధికంగా వాడడం ద్వారా కలిగే నష్టాలతో పాటు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చేతిలో మొబైల్ ఫోన్ లేనిదే నిద్ర పట్టని పరిస్థితి ఉంటుందని, దీంతో మానసికంగా అనేక సమస్యలను కొనితెచ్చుకునేందుకు ప్రమాదం ఉందన్నారు. మొబైల్ ఫోన్ అధికంగా వాడితే జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది, నిద్రకు దూరమవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు.

మౌలానా అబుల్‌కలాం ఆదర్శనీయుడు



అత్మకూర్‌లో మౌలానా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అమరచింత ఉర్దూ మీడియం పాఠశాలలో..

ఆత్మకూర్: భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆదర్శనీయుడని, స్వాతంత్య్ర ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన మహనీయుడని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రహ్మతుల్లా, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు జుబేర్ అన్నారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని స్థానిక గాంధీ చౌక్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశంలో విద్యాభివృద్ధికి మౌలానా ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఇమ్రాన్, తులసీరాజ్, అమీర్, సాయిరాఘవ, పరమేష్, శ్రీనివాసులు, షబ్బీర్, కలీం, ఉస్మాన్, ఫిరోజ్, జావిద్ ఉన్నారు.

అమరచింత: కేంద్ర విద్యా శాఖ మాజీ మంత్రి మౌలానా అబుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని ఉర్దూ మీడియం పాఠశాల హెచ్‌ఎం శ్యామ నాజ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తౌఫిక్, ఖాజాహుస్సేన్, రఫీ, అస్సు, ఆబీద్, స్కూల్ కమిటీ చైర్మన్ ఆయూబ్‌ఖాన్, ఉపాధ్యాయులు రసీదాఉన్నిసాబేగం, జహేద బేగం, షేరాభాను పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ అవసరం



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులను డిసెంబర్‌లో నిర్వహించే జాతీయ ప్రతిభా సాధన పరీక్షలకు సిద్ధం చేయాలని ఎంఈఓ జయశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని ఉప్పరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, సూరాయపల్లి ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో జాతీయ ప్రతిభా సాధన పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసిన విధానం, జవాబుపత్రాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పర్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డిసెంబర్‌లో ప్రాథమిక స్థాయిలో 3వ తరగతి విద్యార్థులకు, ప్రాథమికోన్నత స్థాయిలో 6వ తరగతి, ఉన్నత పాఠశాల స్థాయిలో 9వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష ఉంటుందన్నారు.

యువకుడి మృతి

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం గ్రామానికి చెందిన మండ్ల వేణు(34) అనే యువకుడు 15రోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ భారం మోసే వ్యక్తి మృతి చెందడంతో అతడి భార్య, తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కాగా మృతుడికి భార్య మౌనికతో పాటు కూతురు, కుమారుడు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన వేణు కుటంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

పాన్‌గల్: వికారాబాద్ జిల్లా బొమ్మరసిపేట్ మండలం లాగ్‌చెర్ల గ్రామంలో కలెక్టర్, అధికారులపై దాడి అమానుషమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజు సోమవారం ఒక ప్రకటన డిమాండ్ చేశారు. లాగ్‌చెర్లలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో ఫార్మా విలేజ్‌కి సంబంధించిన విషయంలో ప్రజలకు, అధికారులకు జరిగిన సమావేశంలో కలెక్టర్ ఇతర అధికారులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో రాత్రనక, పగలనక ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడం సరైంది కాదని, కలెక్టర్‌పైనే ఈ విధంగా జరిగితే సామాన్య ఉద్యోగుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: మండలంలోని మూలమళ్లకు చెందిన కిరణ్‌కుమార్ గత నెల 19న ఆటోలో ఆత్మకూర్‌కు వస్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని కనుక్కొని రికవరీ చేసి బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

సర్వేకు సహకరించాలి

ఆత్మకూర్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు పూర్తి వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే నమోదు ప్రక్రియను అధికారులు పరిశీలించారు.

అమరచింత: మండలంలోని కిష్టంపల్లి, ఈర్లదిన్నె, మిట్టనందిమళ్ల, నాగల్‌కడ్మూర్ గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోని వివిధ బ్లాక్‌లలో ఎన్యూమరేటర్‌లు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకుంటున్న తీరును తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐ గోపాల్, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పొరపాట్లు దొర్లకుండా పకడ్బందీగా వివరాలు సేకరించాలని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు ఎన్యుమరేటర్లకు సూచించారు. సర్వేలో మూడో రోజు సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్, శాగాపూర్, శాగాపూర్‌తండాలో ఎంపీడీఓ గోవింద్‌రావు పర్యటించి సర్వే వివరాలను పరిశీలించారు. మండలంలోని 28 జీపీల్లో 945 ఇళ్ల నుంచి వివరాలను సేకరించినట్లు వారు పేర్కొన్నారు.

పీహెచ్‌సీల్లోనే మెరుగైన వైద్య సేవలు



పాన్‌గల్ పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: పీహెచ్‌సీల్లోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని, దీంతో గర్భిణులు పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణి సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పండ్లు, ఆకుకూరలు, పౌష్టికాహారం, ఐరన్ ఫోలిక్, కాల్షియం, బీ కాంప్లెక్స్ మాత్రలు వేసుకోవాలన్నారు. మానసిక ఆరోగ్యం కోసం యోగ, సమయానికి నిద్ర పోవడం వంటి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. తల్లి మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవిస్తారని ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు 102, 108 వాహనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. దీంతో పాటు మండలంలోని వెంగళాయిపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని సీహెచ్ఓ రామయ్య సందర్శించి ఆరోగ్య విషయాలపై గర్భిణులకు అవగాహన కల్పించారు.

అహింసా ధర్మ ప్రచార ర్యాలీ



కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యాన కేంద్రం నిర్వాహకులు

కొత్తకోట రూరల్: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపకుడు బ్రహ్మర్షి పితామహ పత్రీజీ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'కొత్త బంగారు లోకం పిరమిడ్ ధ్యాన కేంద్రం', హనుమ పిరమిడ్ ధ్యాన శక్తి మహాక్షేత్రం ఆధ్వర్యంలో సోమవారం కొత్తకోట పట్టణంలో ఏర్పాటు చేసిన ధ్యాన, అహింసాధర్మ ప్రచార ర్యాలీ కార్యక్రమాన్ని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ధ్యాన కేంద్రం నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి మనిషి ధ్యానం చేయాలని, మనశ్శాంతితో, ఆనందంగా జీవించాలని, అదేవిధంగా ప్రతి ప్రాణికి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందన్నారు. ఏ జీవిని చంపరాదని, తన జీవితమంతా ధ్యాన, అహింసా ధర్మ ప్రచారానికి అంకితం చేసి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిన బ్రహ్మర్షి పితామహ పత్రీజీ పుట్టిన రోజుని పురస్కరించుకుని ధర్మప్రచార ర్యాలీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సాయిబాబా, ప్రభాకరయ్య, సైదయ్య, రమేష్, రామకృష్ణ, ఆంజనేయరెడ్డి, ధ్యానభిలాషులు, శాఖాహారులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించండి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న అంజాద్ అలీ

మదనాపురం: మండల కేంద్రం నుంచి రామన్‌పాడు ప్రాజెక్టు మీదుగా ఆత్మకూర్ పట్టణ వరకు బీటీ రోడ్డు వేయాలని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజాద్‌అలీకి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుపై గుంతలు ఏర్పడి కంకర తేలిందన్నారు. గుంతల రోడ్డుతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు, డ్యాం సందర్శకులు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. అదే విధంగా రామన్‌పాడు రేషన్ షాపుకు సంబంధించి ప్రతి నెల 50 క్వింటాళ్ల రేషన్ బియ్యానికి గాను 35 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

మదనపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్నప్పుడు ఒకే తరగతి గదిలో ఉండి విద్యాభ్యాసం చేసిన వారు విడిపోయిన 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అప్పట్లో విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో మహేష్, శ్రీకాంత్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రవికుమార్, చెన్నకేశవులు, శ్వేత, రాధ, ప్రసన్న, మంజుల, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.


కార్మికుల సంక్షేమానికి తూట్లు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సురేష్

వనపర్తి రూరల్: కార్మిక వర్గాల చెమట చుక్కలతో పోగవుతున్న దేశ సంపదను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, దోపిడి వర్గాలకు దోచి పెడుతూ కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడుస్తున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంఘటిత రంగం కార్మిక వర్గంపై ఆర్థిక దోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైద్య రంగంలో పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ, సిబ్బంది కనీస వేతనాలు లేక నిలువునా శ్రమ దోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐలు అందడం లేదన్నారు. జిల్లా మెడికల్ కళాశాలలో కార్మికులకు పని భారం పెరిగిందని వాపోయారు. కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు పండుగ అర్జిత సెలవులు మంజూరు చేయాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ బేషరతుగా పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల యూనియన్ నాయకులు వరుణ్, వీరమ్మ, భారతి, నారమ్మ, బుజ్జమ్మ, సుధా, శోభ, శ్రీగంగ, మన్నెమ్మ, శ్రీదేవి, సుజాత, ఇంద్రజ, లావణ్య, రాజేశ్వరి, లత, రాజశేఖర్, చెన్నమ్మ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు సంత స్థలం కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

పెబ్బేరు రూరల్: స్థానిక సంత స్థలాన్ని కాపాడాలని వేణుగోపాలస్వామి భూమి పరిరక్షణ సమితి కమిటీ సభ్యులు తహసీల్దార్ లక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా పెబ్బేరు సంత స్థలం వివాదం కొనసాగుతుంది. పట్టాదారులైన పూజారులకు అనుకూలంగా ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో పట్టణవాసులు పార్టీలకు అతీతంగా సంత స్థలాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. సంత స్థలం పరిరక్షణ కమిటీ సభ్యు లు మాట్లాడుతూ ఐక్యతతో ఉద్యమం చేసి సంత స్థలాన్ని కాపాడుకుందామని, పార్టీలకు అతీతంగా కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో స్థల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బాలస్వామి, సభ్యులు దయాకర్‌రెడ్డి, సహదేవుడు, సంతోష్, ఎల్లస్వామి, వర్తకవ్యాపారులు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ: కేసు నమోదు

పాన్‌గల్: భూ తగాదాలతో ఇద్దరు సోదరుల మధ్య జరిగిన ఘర్షణలో రెండు వరవర్గాలపై కేసు నమోదైన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన చిన్న శంకరయ్య, పెద్ద శంకరయ్య ఇద్దరు సోదరులు. వీరి ఇద్దరి మధ్య భూ తగాదాలతో పాత గొడవలు ఉన్నాయి. ఈ నెల 10న పొలం వద్ద చిన్న శంకరయ్య, అతని కుమారుడు నాగవర్ధన్‌పై పెద్ద శంకరయ్య, అతడి భార్యతో పాటు మాధరావుపల్లికి చెందిన రాజు, భీముడు కట్టెలతో దాడి చేయగా రక్త గాయాలు అయ్యాయి. తనతో పాటు కుమారుడిపై దాడి చేసిన వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని చిన్న శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై, చిన్న శంకరయ్య, అతడి కుమారుడు నాగవర్ధన్ కట్టెతో దాడి చేసి గాయపర్చిన విషయంపై పెద్ద శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.